శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు
- కనకమహాలక్ష్మి దేవస్థానంలో వివిధ అలంకరణల్లో దర్శనమివ్వనున్న అమ్మవారు
- దుర్గాలమ్మ ఆలయంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు
- ఇప్పటికే భవానీ మాలలు ధరించిన భక్తులు
- విశేష అలంకరణలో దర్శనమివ్వనున్న కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధిలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్నాయి.ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కనకమహాలక్ష్మి దేవస్థానం, దుర్గాలమ్మ ఆలయం, పాతనగరం కురుపాంమార్కెట్ సమీపాన కన్యకాపరమేశ్వరి ఆలయంలో పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా ఇప్పటికే భక్తులు భవానీ మాలలు ధరించారు.

కనకమహాలక్ష్మి దేవాలయంలో..

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 3న ఆదిలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజున అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. 4న ధనలక్ష్మిగా అమ్మవారిని అలంకరించి, లక్ష చామంతులతో పూజ చేస్తారు. 5న ధాన్యలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారు. ఆ రోజు లడ్డూలతో పూజ నిర్వహిస్తారు. 6న ధైర్యలక్ష్మిగా అలంకరించి, లక్ష తులసీ పూజ నిర్వహించనున్నారు. 7న సంతానలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఆ రోజు కలువ పూలతో విశేషంగా పూజ జరుపుతారు. 8న విజయలక్ష్మిగా అలంకరించి, అమ్మవారికి గులాబీలతో , 9న విద్యాలక్ష్మిగా అలంకరించి శ్రీపుష్పయాగం, 10న గజలక్ష్మిగా అలంకరించి లక్ష గాజులతో పూజ నిర్వహించనున్నారు. 11న మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిస్తారు. ఆ రోజు శాకంబరిగా అలంకరించనున్నారు. నవరాత్రుల చివరి రోజున 12న స్వర్ణలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు. ఆ రోజు 108 బంగారు పుష్పాలతో అర్చన నిర్వహించనున్నారు.


కనకమహాలక్ష్మిగా(ఫైల్‌ఫొటో)

దుర్గాలమ్మ ఆలయంలో..



శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని దుర్గాలమ్మ ఆలయంలో ఈ నెల 3 నుంచి 12 వరకు విశేష పూజలు చేయనున్నారు. ప్రతిరోజూ అమ్మ వారు ప్రత్యేకఅలంకరణలో భక్తులకు దర్శన మివ్వనున్నారు. 3న స్వర్ణకవచాలంకృత దుర్గాదేవిగా, 4న బాలత్రిపుర సుందరీదేవిగా, 5న గాయత్రీదేవిగా, 6నఅన్నపూర్ణాదేవిగా, 7న లలితా త్రిపురసుందరీదేవిగా, 8నమహాసరస్వతి దేవిగా(మూలానక్షత్రం),9నమహాలక్ష్మిగా, 10న దుర్గాష్టమినాడుదుర్గాదేవిగా, 11న మహిషాసురమర్ధినిగా,12నవిజయదశమినాడు రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవీ శరన్నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. 3న కన్యకాపరమేశ్వరిని బాల త్రిపుర సుందరిదేవిగా, 4న లలితాదేవిగా, 5న గాయత్రీదేవిగా, 6న రాజరాజేశ్వరిగా, 7న అన్నపూర్ణగా, 8న చండీదేవిగా దర్శనమివ్వనున్నారు. ఆ రోజున మహిళలచే వారాహిదేవి పూజ నిర్వహించనున్నారు. 9న సరస్వతీదేవిగా, 10న మహాలక్ష్మీదేవిగా, 11న మానసాదేవిగా, 12న మహిషాసురమర్ధినిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రతిరోజూ తెల్లవారుజామున ప్రత్యేక పంచామృతాభిషేకాలు, సామూహిక పూజలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


కుంకుమార్చన చేస్తున్న అర్చకుడు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు తిరుపతిరావు వేదపండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన..

కనకమహాలక్ష్మి ఆలయంలో ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే లక్ష కుంకుమార్చన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజను ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు సీపీఎం ఆందోళనలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్: రాష్ట్రంలో కూటమి నేతలు ఇచ్చిన ఎన్నికల హామీలు అమలుచేయాలని, ఉచితంగా ఇసుక ఇవ్వాలని, ఇసుక కొరత నివారించాలని, కార్మిక సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ఆందోళనలను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 3 వరకు భవన నిర్మాణ రంగ కార్మికుల అడ్డాల వద్ద ధర్నాలు, 4న ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహ పార్కు వరకు ప్రదర్శన, ధర్నా చేయనున్నట్టు తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి. కుమార్, జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, ఆర్.ఎస్.ఎన్. మూర్తితో కలిసి మంగళవారం సీపీఎం కార్యాలయంలో ఆందోళన కార్యక్రమాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ ఇసుక అందుబాటులో లేకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని చెప్పారు. దీంతో జిల్లాలో సుమారు 50 వేల మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటికి టన్ను ఇసుక ధర రూ.వెయ్యి ఉంటే ప్రస్తుతం రూ.1900 నుంచి రూ.2,300 పెరిగిందని చెప్పారు. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి ఇసుక రావడం ఆగిపోయిందన్నారు. భీమిలి, అగనంపూడి, ముడసర్లోవ స్టాక్‌యార్డ్‌ల్లో ఇసుక లేదని చెప్పారు. నిరసనలు, ధర్నాల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు వాసుపల్లికి ఆహ్వానం


వాసుపల్లికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గల్లీ క్రికెట్ బాయ్స్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు మహారాణిపేటలోని రామజోగిపేటలో గల్లీ క్రికెట్ బాయ్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం వాసుపల్లిని కలిసి దసరా ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో 29వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు కోరాడ సురేష్, తమ్మినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పోటీలు


పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: స్వర్ణాంధ్ర-2047లో భాగంగా విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు పలు పోటీలు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు క్విజ్, డిబేట్, వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణాంధ్ర-2047 పేరిట నిర్వహించిన సర్వేలో విద్యార్థినులు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు ఎటువంటి అభివృద్ధి సాధించాలో విద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తపరిచారు. అనంతరం విజేతలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె.ఎల్.శిరీష, ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

జూలో స్వచ్ఛతా హీ సేవ


జూలో స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న కృష్ణా కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మద్దిలపాలెం: కృష్ణా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ.విజయబాబు ఆదేశాల మేరకు సోమవారం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ప్లాస్టిక్ రహిత జూ పార్కుగా తీర్చిదిద్దేందుకు ముందుకు వచ్చిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ బి.భారతి, ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి.పద్మిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం అధికారులు పి.ఉమామహేశ్వరరావు , జి.వి. ప్రతాప్, టి.శామ్యూల్ డేవిడ్ రాజ్, బి.లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమ భవన్ ఆవరణంలో

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని సంక్షేమ భవన్‌లో మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ భవన్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు భవన సముదాయం పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తాచెదారం తొలగించడంతో పాటు మొక్కలను సంరక్షించే ఏర్పాట్లు చేశారు.సాంఘిక సంక్షేమశాఖ డీడీ రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా కార్యాలయ పరిసరాలను ఉద్యోగులంతా కలిసి శుభ్రపరచడం జరిగిందన్నారు.ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.సత్యపద్మ, బీసీ కార్పొరేషన్, బీసీ వెల్ఫేర్‌విభాగాలఉద్యోగులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా గరుడసేవ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఈసేవని ఉదయం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడ వాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు.

వివేకానంద ఆశ్రమానికి నిత్యావసర సరకుల వితరణ


ఆశ్రమానికి నిత్యావసర సరకులు అందజేస్తున్న మయాంక్ కుమారి

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద ఆశ్రమంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమం కోసం శక్తి విక్రందేవ్ జ్ఞాపకార్థం రోటరీక్లబ్ విశాఖపట్నం సభ్యురాలు మయాంక్ కుమారి మంగళవారం రూ.25వేల విలువ చేసే ఎనిమిది బస్తాల బియ్యం, ఆయిల్, చింతపండు, కందిపప్పు, కారం, ఉప్మా రవ్వ, సబ్బులు, పేస్టులు తదితర నిత్యావసర వస్తువులు అందజేశారు.ఈ సందర్భంగా మయాంక్ కుమారికి సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి వివేకానంద సంస్థ ప్రతిరోజూ నిర్వహించే నిత్యాన్నదానం, గోషా ఆస్పత్రిలో భోజనాల పంపిణీకి దాతలు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ వినయ్‌గాంధీ, కార్యదర్శి మణిమాల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'బొబ్బిలి వీణ' తయారీ శిక్షణ


శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

దాబాగార్డెన్స్: లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్(ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ) రెండు నెలలుగా విజయనగరం జిల్లా గొల్లపల్లిలో నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, బొబ్బిలి వీణ తయారీ శిక్షణ మంగళవారంతో ముగిసింది. లేపాక్షి ప్రిన్సిపల్ సెక్రటరీ సునీత, ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఎం.విశ్వ పలువురు అధికారుల ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఫండ్ ద్వారా విశాఖపట్నం లేపాక్షి మేనేజర్ ఎ.కార్తీక్ నేతృత్వంలో ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా లేపాక్షి మేనేజర్ కార్తీక్ మాట్లాడుతూ రెండు నెలల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాస్టర్ ఎస్.శంకరాచారి, బి.మురళీ, 20 మంది బృందం మార్కెట్లో డిమాండ్ ఉన్న ప్రొడక్ట్స్ తయారీలో శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎం.రామలక్ష్మి శిక్షణ పొందిన వారిని అభినందించారు. కార్యక్రమంలో బొబ్బిలి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వెంకటమురళీకృష్ణ, 10వ వార్డు కౌన్సిలర్ కె.గోవిందమ్మ, లేపాక్షి సిబ్బంది పాల్గొన్నారు.

16న జోన్-5లో వాణిజ్య సముదాయాలకు వేలం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్-5 పరిధిలో 40 నుంచి 63వ వార్డు వరకు ఖాళీగా ఉన్న జీవీఎంసీ దుకాణాలు, కల్యాణ మండపాలు, రోడ్డు సైడ్ మార్కెట్లకు ఈ నెల 16న జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జోనల్ కమిషనర్ బి.రాము మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 60వ వార్డు గుల్లలపాలెం షాపింగ్ కాంప్లెక్స్‌లో 8, 22, 24, 48, 52, 54, 55, 56, 57, 58 నంబర్ల దుకాణాలు, సంజీవయ్య కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం, త్రినాథపురం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒకటవ నంబరు దుకాణం దుకాణం, 51వ వార్డులో గల మాధవస్వామి కల్యాణమండపం మూడేళ్ల కాలపరిమితికి, గుల్లలపాలెం దుకాణంరోడ్డు పక్కన మార్కెట్స్ హాకర్ మండలం, పల్లివీధి రోడ్సైడ్ మార్కెట్, జనతాకాలనీ(బుధవారం) వారం మార్కెట్, కంచరపాలెం రోడ్సైడ్ మార్కెట్, తాటిచెట్లపాలెం రోడ్సైడ్ మార్కెట్, అక్కయ్యపాలెం రోడ్డు సైడ్ మార్కెట్‌లకు ఏడాది కాలపరిమితికి అద్దెకు ఇచ్చేందుకు వేలం వేయనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు జీవీఎంసీ నిబంధనలకు లోబడి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు జోన్-5 కార్యాలయంలో పర్యవేక్షకుడిని పని వేళల్లో సంప్రదించాలని జోనల్ కమిషనర్ తెలిపారు.

మహిళా కళాశాలలో స్వచ్ఛతా దివస్


పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం స్వచ్ఛతా దివస్ నిర్వహించారు. గాంధీ జయంతి ఉత్సవాల్లో భాగంగా కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛత దివస్ నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి సౌభాగ్య ఎలక్ట్రిసిటీ అనే అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గల విద్యుత్ రహిత గృహాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు అందించి, నాణ్యమైన విద్యుత్ సేవలు అందివ్వడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం ఈ పథకం లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏయూ అనుబంధ కళాశాలల విరాళాలు


ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావుకు చెక్కులు అందిస్తున్న అనుబంధ కళాశాల ప్రతినిధులు

మద్దిలపాలెం : విజయవాడ వరద బాధితుల సహాయమందించేందుకు ఆంధ్రవిశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలు ముందుకు వచ్చాయి. కె.కోటపాడులోని అయ్యన్న డిగ్రీ కళాశాల రూ.లక్ష, విశాఖ సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల రూ.80 వేలు, సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల రూ.లక్ష , విజయనగరంలోని శ్రీ లక్ష్మీ గణపతి కళాశాల రూ.12 వేలు అందజేశాయి. కళాశాల ప్రతనిధులు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుకు చెక్కులను అందజేశారు. ఈ చెక్కులను సీఎం సహాయనిధికి పంపనున్నామని రిజిస్ట్రార్ చెప్పారు. కార్యక్రమలో సి.డి.సి. డీన్ ఆచార్య టి.వి.కృష్ణ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు తీసుకోవాలి

జోన్-4 జెడ్సీ మల్లయ్యనాయుడు


కాలువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సిబ్బందికి సూచించారు. జోన్ పరిధిలో 34,39 వార్డుల్లోని కొబ్బరితోట, పాతనగరంలో కోటవీధి, చిలకవీధి, థమ్సన్‌వీధి ప్రాంతాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, మలేరియా వ్యాధి ప్రబలకుండా తీసుకోవలసి చర్యలపై మలేరియా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. నిల్వ నీళ్ల, తాగిపారేసిన కొబ్బరిబొండాలు, పాతటైర్లు వంటివి ఇళ్ల ఆవరణలో లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో స్వచ్ఛత సంస్కార్

మహారాణిపేట: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ అండ్ ఇంజినీరింగ్ ట్రెనింగ్ యూనిట్ (సీఐఎఫ్ఎన్ఈటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం ఫిషింగ్ హార్బర్ వద్ద బీచ్‌రోడ్డులో స్వచ్ఛత సంస్కార్ కార్యక్రమం నిర్వహించారు. గత నెల 17 నుంచి మంగళవారం వరకు రోజుకు ఒక కార్యక్రమం చొప్పున జరిపారు. ముగింపు సందర్భంగా బీచ్‌రోడ్డు,చుట్టు పక్కల ప్రదేశాలను శుభ్రపరచడంతో పాటు స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వివిధ సేవలను అందించిన వారికి బహుమతులు, శిక్షణ పొందిన వారికి స్వచ్ఛత కిట్లను అందజేశారు.

వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వండి


సమావేశంలో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు,ఇతర అధికారులు

మహారాణిపేట: అనారోగ్యంలో ఆయా ఆస్పత్రులకు వచ్చే వృద్ధులకు వైద్యులు, సిబ్బంది అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వారు ఎక్కువ సేపు ఆస్పత్రిలో నిరీక్షించకుండా వెంటనే వైద్యం అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా అన్ని ఆస్పత్రులలో ఈ విధానం అమలు చేయాలన్నారు. ఆరోగ్య విషయంలో వృద్ధులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈమేరకు వైద్యశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో పలువురు నోడల్ అధికారులు డాక్టర్ బి.ఉమావతి, డాక్టర్ సమత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. రామాటాకీస్ దగ్గరలో ఉన్న గోల్డెన్ ఏజ్ ఆశ్రమంలో వద్దులకు బి.పి, షుగర్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

'గొంతు తెగిన అక్షరం' పుస్తకావిష్కరణ


పుస్తక రచయిత చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్యం

దాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో మంగళవారం 'గొంతు తెగిన అక్షరం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. యువ కవి సిర్పి చంద్రశేఖర్ రచించిన ఆ పుస్తకాన్ని ఏవీఎన్ కళాశాల, సహృదయ సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో జరిగిన సభలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు, శేఖర్ మంత్రి ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే కవిగా, రచయితగా మంచి పేరు సంపాదించిన యువకవి చంద్రశేఖర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే రచనలు, కవితల ద్వారా చంద్రశేఖర్ మంచి ప్రతిభ కనబరిచారన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ సమాజంలో యువతరానికి చంద్రశేఖర్ స్ఫూర్తిదాయకంగా నిలిచారంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శంకర నారాయణ రావు, స్వరాజ్యలక్ష్మి, తెలుగు విభాగధిపతి పి.వెంకటరత్నం, గాయత్రీ, నరసింహమూర్తి, పైడి రజని, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు


ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

దాబాగార్డెన్స్: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడకలను డాబాగార్డెన్స్‌లో గల బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఆంధ్రా మెడికల్స్, రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పటల్స్, వాసన్ కేర్ హాస్పటల్స్ ద్వారా ఉద్యోగుల కోసం వైద్య శిబిరాలు నిర్వహించారు. సాయంత్రం పెద్ద ఎత్తున ఉద్యోగులు ర్యాలీ చేశారు. బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబేడ్కర్ కూడలి, జైల్‌రోడ్డు, జడ్జికోర్టు జంక్షన్, జగదాంబ సెంటర్, సరస్వతీ పార్క్ జంక్షన్ మీదుగా తిరిగి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ పీజీఎం టీడీ పాల్ విలియం మాట్లాడుతూ హైస్పీడ్ ఫైబర్ ఇంటర్నెట్, 4జీ సేవల గురించి వివరించారు. పీజీఎం(ఆపరేషన్స్) ఆడమ్ మాట్లాడుతూ ఎఫ్‌టీటీహెచ్ సేవలు, ఎంఎన్‌పీ బుకింగ్‌ల మెరుగుదల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి.శ్రీనివాసరావు, ఎం.సత్యప్రసాద్, కె.జగదీశ్వరరావు, ఆర్.శ్రీకాంత్ పట్నాయక్, బి.వి.వి. నగేష్, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

• అయ్యో.. తాజ్





విశాఖ నగరం ఎన్నో చారిత్రక గాథలకే కాదు మరెన్నో ప్రేమ కథలకూ వేదిక. అలాంటి వాటిలో ముఖ్యమైనది విశాఖలోని కురుపాం సెంటర్లో ఉన్న విశాఖ తాజ్‌మహల్.ఇది ఇప్పుడు నిర్లక్ష్యానికి గురైంది. ఎవరూ పట్టించుకోకుండా వదిలివేయడంతో అలనాటి వైభవాన్ని కోల్పోయి, దైన్యంగా దర్శనమిస్తోంది. - బీచ్‌రోడ్డు

వైభవంగా కృష్ణమయ్య జయంతి

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం శ్రీకాంత కృష్ణమాచార్య(కృష్ణమయ్య) జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉన్న కృష్ణమయ్య విగ్రహం వద్ద దేవస్థానం వైదికులు విశేషంగా పూజలు నిర్వహించి హారతులిచ్చారు. స్వామివారిపై కృష్ణమయ్య రచించిన పలు సంకీర్తనలను ఈ సందర్భంగా వైదికులు విన్నపం చేశారు. కృష్ణమయ్య చరిత్రను, విశిష్టతను వివరించారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు, పారాయణదారులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.